

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 26.0
తణుకు : 29.0 - 26.0

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు సెలవును ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెలవును అన్ని పాఠశాలలు తప్పనిసరిగా అమలు చేయాలని లేకుంటే పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే సోమవారం కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రాల్లో జరగాల్సిన మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



పీఎం లంక వద్ద బంగాళాఖాతంలో ఎగసిపడుతున్న అలలు

రెడ్ అలర్ట్

- వర్షం నీరు లాగకుండానే మళ్లీ ముంచేసింది
- ఇంకా ముంపులోనే 12,450 ఎకరాల చేలు
- భారీ పెట్టుబడులతో నష్టపోయిన రైతులు
- చినుకు పేరు చెబితే వణికిపోతున్నారు

నేడు, రేపు భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు



నరసాపురంలో నీట మునిగిన రోడ్డు

భీమవరం టౌన్/రూరల్/యలమంచిలి/ఆకివీడు రూరల్/మొగల్తూరు/ఆచంట/పాలకొల్లు రూరల్/ఉండి, సెప్టెంబరు 8: వరుణడు ఉగ్రరూపం దాల్చాడు. వాయువ్య బంగాళా ఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని, సోమ, మంగళవారాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే ఐఎండీ హెచ్చరికలు జారీచేసింది. వాతావరణ హెచ్చరికలలో భాగంగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం అర్థరాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మధ్యలో కొంత గ్యాప్ ఇచ్చినా కుండపోత ఆగలేదు. వినాయక చవితి పండుగపై వర్షం ప్రభావం పడింది. భీమవరం పట్టణంలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్ల వద్దకు జనం వెళదామని అనుకున్నా వర్షం కారణంగా చాలామంది ఇళ్లల్లో నుంచి కదల్లేదు. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 58.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెంటపాడు 24.6, తణుకు 30.2, అత్తిలి 5.2, గణపవరం 5.6, ఆకివీడు 6.4, ఉండి 20.8, పాలకోడేరు 4.2, పెనుమంత్ర 4.2, ఇరగవరం 10.6, పెనుగొండ 3.2, ఆచంట 5.2, పోడూరు 4.4, వీరవాసరం 3.2, భీమవరం 8.4, కాళ్ళ 2.4, మొగల్తూరు 2.4, నరసాపురం 5, పాలకొల్లు 5.4, యలమంచిలి 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వర్షం నీరు లాగకుండానే మళ్లీ ముంపు

మొన్నటి వరకు కురిసిన వర్షాలకు వరి చేలల్లో ముంపు ఇంకా తగ్గలేదు. మళ్లీ అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత ముంపు పెరిగింది. జిల్లాలో 12,450 ఎకరాల్లో వరి చేలు ఆదివారానికి ముంపునకు గురైనట్లు అధికారులు అంచనా వేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో ముంపుబారిన పడే చేలు మరింత పెరగవచ్చుననే లెక్కలు వేస్తున్నారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో ఈ ఏడాది లక్షా 90 వేల ఎకరాలలో సార్వా సాగు చేపట్టారు. ఈ వర్షాలకు 50 వేల ఎకరాలపై ప్రభావం ఉంటుందని రైతులు చెబుతున్నారు. పది రోజుల నుంచి ముంపు నీటిలో ఉన్న 11 వేల ఎకరాలపైగా వరిచేలు మరింత దెబ్బతినేలా చేస్తాయి.



ఉణుకులో ఆర్బీ సర్వీసు రోడ్డులో నిలిచిన నీరు



కాళ్ల లంక ప్రాంతంలో నీట మునిగిన వరి చేను



పాలకొల్లు మండలం దగ్గులూరులో నీట మునిగిన వరి చేలు

చెరువులను తలపిస్తున్న వరిచేలు

పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలు ముంపు బారినపడి చెరువులను తలపిస్తున్నాయి. యలమంచిలి మండలంలోని 1200 ఎకరాల విస్తీర్ణంలో పనలు నానుతూ ఉండడంతో వరి మూనలు కుళ్లిపోతున్నాయి. చేలల్లో నీరు బయటకు మళ్లించేందుకు అవకాశం లేకపోతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ సార్వాలో పడిన వర్షాలు, వరదలకు నారుమడులు దెబ్బతినడంతో కొందరు రైతులు రెండో నారుమడులు వేశారు. మరికొందరు నారును కొని నాట్లు పూర్తి చేశారు. ఇవి ముంపు బారిన పడడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఎకరానికి రూ.18 వేలకుపైగా పెట్టుబడి పెట్టామని, వరి మూనలు కుళ్లిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఆకివీడు మండలం చినిమిల్లిపాడులో ఊరిని ఆనుకుని ఉన్న దేవుడి మాన్యం వరి పొలాలను ఆదివారం వరద నీరు గట్లపై నుంచి ప్రవహించి ముంచివేసింది. రైతులు తీవ్రంగా నష్టపోయి, నిరాశ చెందారు. వారం రోజలుగా కష్టపడి గట్లను కాపాడుకుంటూ వస్తున్నారు. కొల్లేరులో రోజురోజుకు పెరుగుతున్న నీటి మట్టం వలన నష్టపోయారు. ఉప్పుటేరులో పేరుకుపోయిన కిక్కిసను తొలగిస్తేనే రైతులకు ఇబ్బందులు ఉండవు. మొగల్తూరులో నీట మునిగిన వరి చేలల్లో ముంపు నీరు లాగక రైతులు ఆందోళన చెందుతున్నారు. 'శివారు ప్రాంతం కావడం.. ఎగువ ప్రాంత ముంపు నీరు ఉప్పుటేరులోకి అధికంగా రావడంతో చేలల్లో నీరు లాగడం లేదు. ఇప్పటికే రెండుసార్లు నారుమడులు వేసి సాగు చేశాం. ఎకరాకు రూ.25 వేల వరకూ ఖర్చయ్యింది. వాయుగుండాలతో నిండా మునిగామ'ని రైతులు ఆందోళన వాపోయారు. చేలల్లో ముంపును ఇంజన్లు వేసి తోడిస్తున్నా ఉప్పుటేరు లాగక ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట వేమవరంలో నక్కల కాలువ ఆనుకుని వున్న పొలాలు ఇటీవలే పూర్తిగా నీట మునగడంతో రెండోసారి నాట్లతోపాటు ఆకుమడులు వేశారు. మరోసారి ఈ పొలాలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి.

పాలకొల్లు మండలం దగ్గులూరు యానాదివారి పుంతలో 110 ఎకరాలు, భగ్గేశ్వరం డ్రెయిన్ దిగువ మరో 25 ఏకరాలు నీట మునిగాయి. ఆక్వా చెరువుల్లో అక్సిజన్ కొరతతో తీవ్ర నష్టాలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా యండగండి వద్ద యనమదుర్రు డ్రెయిన్, ఉండి-వెలివర్రు వద్ద బొండాడ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వీటిని ఆనుకుని వున్న వరి చేలు ముంపు బారిన పడ్డాయి. అధికారులు అప్రమత్తమై పర్యవేక్షిస్తున్నారు.



కనకాయలంక కాజ్ వేపై వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న గ్రామస్థులు

గోదావరి తగ్గుముఖం

- నేటి నుంచి నరసాపురం-సఖినేటిపల్లి మధ్య పంటు రాకపోకలు

యలమంచిలి/నరసాపురం, సెప్టెంబరు 8:గోదావరి వరద ఆదివారం తగ్గుముఖం పట్టింది. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై ఆదివారం సాయంత్రానికి అడుగు ఎత్తులో వరద ప్రవహిస్తోంది. గ్రామస్తులు కొందరు నీటిలోనే వెళుతుండగా, మరికొందరు పడవలను ఉపయోగిస్తున్నారు. సోమవారం ఉదయానికి ముంపు నుంచి బయటపడే అవకాశాలున్నాయి. నరసాపురం వశిష్ట గోదావరిలోనూ వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వచ్చి చేరడంతో ప్రవాహ ఉధృతి తగ్గలేదు. ఐదో రోజు ఉభయ గోదావరి జిల్లాల మధ్య పంటు, పడవల రాకపోకలను నిలిపివేశారు. సోమవారం నుంచి ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల మధ్య నరసాపురం- సఖినేటిపల్లి మధ్య పంటు రాకపోకలను పునరుద్దరిస్తున్నట్లు ఆర్డీవో అంబరీష్ చెప్పారు.

ఇంకా తగ్గని కొల్లేరు ఉధృతి

- నీట మునిగిన రహదారులు.. స్తంభించిన రాకపోకలు

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 8 : ఎగువ నుంచి భారీగా వరద నీరు కొల్లేరులోకి చేరడంతో లంక గ్రామాల్లోని వందల ఎకరాల్లోని చేపల చెరువులు నీట మునిగాయి. రోడ్లు ముంపు బారినపడి లంక గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచాయి. కొల్లేరు సరస్సును ఆనుకుని ఉన్న చేపపిల్లల చెరువులు వందల ఎకరాలు నీటమునిగి రైతులు లక్షల్లో నష్టాన్ని చవిచూశారు. మరో రెండు రోజులపాటు భారీగా వరద నీరు కొల్లేరులోకి చేరనున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కైకలూరు-ఏలూరు రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు. గోకర్ణపురం నుంచి పైడిచింత పాడుకు వెళ్లే రహదారి పూర్తిగా ముంపునకు గురైంది. అయా గ్రామాల్లోని ప్రజలు పడవలపై రాకపోకలను సాగిస్తున్నారు. అలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారిలో వడ్లకూటితిప్ప నుంచి సర్కారు కాల్వ వరకు ఉన్న రహదారికి, సర్కారు కాల్వ నుంచి పందిరిపల్లిగూడెం వరకు ఉన్న రోడ్డులో రెండుచోట్ల గండ్లు పడి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సర్కారు కాల్వ నుంచి ఉధృతంగా వరదనీరు ఉప్పుటేరులోకి ప్రవహిస్తోంది. ఉప్పుటేరులో జాతీయ విస్తరణ పనుల్లో నిర్మాణ దశలో నిలిచిపోయిన వంతెన ప్రాంతంలో ఉన్న మట్టిదిబ్బలను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. రోడ్డు, రైల్వే బ్రిడ్జి వద్ద దట్టంగా అలుముకున్న కిక్కిసను తొలగిస్తున్నారు. వరదనీరు చేరడంతో కైకలూరు మండలంలోని పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, గోకర్ణపురం, గుమ్మళ్లపాడు, వడ్లకూటితిప్ప, పెంచికలమర్రు, కొట్టాడ, జంగంపాడు, పల్లిపాలెం గ్రామాలను నీరు చుట్టుముట్టింది. కైకలూరు వెలమపేట కాలనీ, కొత్తపేట, బస్టాండు ఎదురుగా ఉన్న రోడ్డులో సొసైటీ బ్యాంకు, ఇళ్ళు పూర్తిగా నీటమునిగాయి. కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో గోపవరం వద్ద పుల్లవా డ్రెయిన్ పొంగి పొర్లడంతో వంతెన ముంపునకు గురై రాకపోకలను నిలిపివేశారు. తామరకొల్లు నుంచి వేమవరప్పాడు రోడ్డు ముంపునకు గురై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు రహదారిపై రాకపోకలు జరగకుండా ట్రాక్టర్ ట్రక్కులను అడ్డుపెట్టారు. అగ్రహారం రోడ్డులోనికి పుల్లవా డ్రెయిన్ పొంగి రహదారి ముంపునకు గురైంది. మండవల్లి మండలంలో కొల్లేటి నీటిమట్టం పెరగడంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గ్రామాల నుంచి బయటకు వచ్చేందుకు పడవలను ఆశ్రయిస్తున్నారు.



కైకలూరు-ఏలూరు రోడ్డుపై కొల్లేరు వరద నీరు



లంకగ్రామాల్లో పడవపై కైకలూరు ఎమ్మెల్యే కామినేని పర్యటన

కుట్టిందంటే.. ఇకంతే



- తీరంలో ఆఫ్రికన్ విషపు ఈగలు విహారం
- రుస్తుంబాద మామిడి చెట్టుపై పుట్ట
- రెండు నెలల క్రితం ఒకరు మృతి
- 20 ఏళ్ల క్రితం తొలిసారి గుర్తింపు
- మళ్లీ దర్శనం.. జనంలో భయం

నరసాపురం, సెప్టెంబరు 8 : రెండు నెలల క్రితం నరసాపురం మండలం గొందిలో ఉపాధి పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులను తేనెటీగలు వంటి పురుగులు కుట్టడంతో ఒక్కసారిగా వారు కేకలు వేశారు. ఇతర కార్మికులు అప్రమత్తమైన ఈ పురుగులను గుడ్డలతో తరిమివేశారు. తేనేటీగలు కుట్టాయని అంతా అనుకున్నారు. కాని కుట్టినచోట నల్లగా మారడం, వాపు రావడంతో వీరిద్దరూ బాధ భరించలేక విలవిల్లాడారు. వెంటనే వారిని పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కుట్టింది తేనేటీగలు కాదు.. ఆఫ్రికన్ విషపు ఈగలుగా గుర్తించి వైద్యం అందించారు. అయితే చికిత్స పొందుతూ ఒక కార్మికుడు మృతి చెందాడు. వెంటనే మరో కార్మికుడిని భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం అందడంతో అతను ప్రాణపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన మరిచిపోకుండా పది రోజుల క్రితం నరసాపురం మండలం రుస్తుంబాద లెప్రసీ ఆస్పత్రి సమపంలో పొలానికి వెళుతున్న ఒక రైతును మళ్లీ అవే విషపు ఈగలు కుట్టాయి. నొప్పి భరించలేక కేకలు వేస్తుండటంతో అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యమందడంతో ప్రాణాలతో బయటపడ్డారు. తేరుకున్న రైతులు చెట్లను పరిశీలించగా ఒక చెట్టుపై పుట్ట కనిపించింది. రెండు రోజుల వరకు ఎవరూ అటు వైపు వెళ్లే సాహసం చేయలేదు. చివరికి తేనె తీసే ఒక నైపుణ్యం కలిగిన వ్యక్తిని తీసుకొచ్చి పుట్టలకు నిప్పు పెట్టారు.



సకాలంలో వైద్యం చేయించుకుంటే..



ఆఫ్రికన్ జాతికి చెందిన ఈ టీగలు విషపూరితమైనవి. ఇవి కుడితే నిర్లక్ష్యం చేయకూడదు. కుట్టగానే ముందు పల్స్ తగ్గుముఖం పడుతుంది. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. లేని పక్షంలో ప్రాణాలకే ప్రమాదం. వాటి ముళ్ల శరీరంలో ఉండడంతో విషం ఎక్కుతుంది. మూడు రకాల ఇంజక్షన్లు చేయాలి. రెండు, మూడు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి.

\- డాక్టర్ బళ్ల మురళి, ఎండీ, నరసాపురం

మళ్లీ తీరంలో పుట్టల భయం

ఈ రెండు ఘటనలు తీర ప్రాంతవాసులను ఉలికిపాటుకు గురిచేశాయి. మళ్లీ విషపు ఈగలు వచ్చాయా? అన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. తోటలు, పొలాల్లోకి వెళ్లేటప్పుడు చెట్లను చూసుకుంటూ మరీ వెళుతున్నారు. ఇంత భయం వీరిలో ఏర్పడటానికి కారణం 20 ఏళ్ల నాటి ఘటనలే. 2004 సునామి తర్వాత సముద్ర తీర ప్రాంతం చెట్లపై మట్టి పుట్టలు ఉండడాన్ని మత్స్యకారులు, రైతులు గుర్తించారు. మొదట వీటిని సాధారణ పుట్టలుగా భావించి పెద్దగా పట్టించుకోలేదు. తొలిసారిగా ఇద్దరి రైతులపై ఈ టీగలు దాడి చేశాయి. ఒకరు మృతి చెందగా.. మరొకరు చికిత్స పొంది బయటపడ్డారు. ఇది మరవక ముందే తూర్పుతాళ్ళ, పీఎం లంక, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లోనూ ఈ పుట్టల్లోని ఈగలు కుట్టడంతో కొందరు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు సకాలంలో వైద్యం చేయించుకుని ప్రాణాలతో బయటపడ్డారు. వరుస దాడులతో తీర ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. చెట్లపై చాలా పుట్టలు ఉండడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. ఆరా తీయగా అఫ్రికన్ విషపు ఈగలుగా నిర్ధారించారు. అప్పట్లో ఓఎన్‌జీసీ సహకారంతో వైద్య, పశు శాఖ సిబ్బంది ప్రత్యేక దుస్తువులు ధరించి వీటిని నాశనం చేసే పనికి శ్రీకారం చుట్టారు. ముందుగా రెండు మండలాల్లో పుట్టలను గుర్తించారు. వాటిపై మత్తు స్ప్రే చేశారు ఆ తర్వాత మంటలు పెట్టి పుట్టలను, వాటిలోని పురుగులను పూర్తిగా నాశనం చేశారు. ఆ తర్వాత వీటి జాడ కనిపించలేదు మళ్లీ రెండు నెలల క్రితం గొంది, రుస్తుంబాద ఘటనలతో ఉలిక్కిపడ్డారు.



రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు, చిత్రంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

జిల్లా పరిషత్‌పై పసుపు పతాక

టీడీపీలో చేరేందుకు చైర్మన్ ఘంటా పద్మశ్రీ సుముఖం

- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరాలని నిర్ణయం
- అంతకుముందే వైసీపీకి రాజీనామా
- సైకిల్ ఎక్కనున్న మరికొందరు జడ్పీటీసీలు
- చింతమనేనితో పార్టీ ముఖ్యుల సమాలోచనలు
- రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమక్షంలో దేశంలో చేరిన జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు

వైసీపీ కీలక పదవుల్లో ఉన్న వారు ఇతర పార్టీల్లో చేరేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. జడ్పీ చైర్మన్ పద్మశ్రీ దంపతులు టీడీపీ తీర్థం తీసుకోబోతున్నారు. ఇప్పటికే ఆమె భర్త ప్రసాదరావు వైసీపీకి రాజీనామా చేసి శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో సైకిల్ ఎక్కారు. జడ్పీ చైర్మన్ రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నారు. రాజీనామాలు చేస్తున్న వైసీపీ నేతలు జనసేన, టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నా వీరిని బుజ్జగించేందుకు వైసీపీ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. 7లో

కట్ట రూ.30

- అమాంతం పెరిగిన ఆకుకూరల ధరలు
- వంకాయలు కిలో రూ.80.. వర్షాల ఎఫెక్ట్



నరసాపురం, సెప్టెంబరు 8 : కూరగాయలు, ఆకుకూరల ధరలు మళ్లీ పెరిగాయి. వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఏ రకం చూసినా... రూ 40పైనే పలుకుతున్నాయి. నిన్న మొన్నటీ వరకు కేజీ రూ.50 ఉన్న వంకాయలు ఒక్కసారిగా రూ.80కి చేరుకున్నాయి. కాయ సైజ్‌ను బట్టి కేజీ రూ.90 కూడా అమ్మారు. జిల్లాలోని వంగ తోటలన్నీ దెబ్బ తినడమే పెరుగుదలకు కారణం. బెండకాయలు రూ.50కి చేరాయి. దోస కేజీ రూ.40, కాకర రూ.40, దొండ రూ.40, బీర రూ.50, ఆనపకాయ సైజును బట్టి రూ.30 నుంచి రూ.40 పలుకుతోంది. టమాటలు రూ.30 నుంచి రూ.35 మధ్య ఉన్నాయి. ఉల్లిపాయాలు రకాన్ని బట్టి రూ.50 నుంచి రూ.55 అమ్ముతున్నారు. మిర్చి కేజీ రూ.30 పలుకుతోంది.

ఆకు కూరల ధరలు అమాంతం పెరిగాయి. కొత్తి మీర కట్ట రూ.50కి చేరింది. తోట, పాల, చుక్క, మెంతికూర కట్టలు ఒక్కోటి రూ.30 పలుకుతోంది. మార్కెట్‌కు ఇవి కూడా తక్కువ వస్తున్నాయి. వర్షాలు తగ్గి పంట దిగుబడి వచ్చే వరకు ధరలు దిగే అవకాశం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఇదే విధంగా ఉంటే ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

వర్షాలతో విద్యుత్ అధికారుల అప్రమత్తం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 8: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారనుందని ఐఎండీ వెల్లడించింది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో సోమ, మంగళ వారాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొన్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. దీనితో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సేలందించేందుకు అవసరమైన యంత్రాగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకుంటున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పిసాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు తెలియజేసి పరిష్కారం పొందవచ్చునని అయన సూచించారు.

విద్యుత్ శాఖ సూచనలు

- తుఫాన్ వేళ భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- తుఫాన్ సమయంలో మీ ఇంటి గృహోపకరణాలు స్విచ్‌లను ఆఫ్‌మోడ్‌లో ఉంచాలి.
- ఇంటి లోపల కరెంట్ స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదు.
- చిన్న పిల్లలను కరెంట్ వస్తువులను తాకనీయ వద్దు
- ఇంటి సర్వీస్ వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వెంటనే తెలియజేయాలి. వాటిని ఎట్టి పరిస్థితులలోను తాకరాదు.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంట్ పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి ఆవరణలో ఉన్న నీళ్ల మోటారు, నీటి పంపులను, వాటికి ఉన్న కరెంటు వైర్లను , జాయింట్లను తాకరాదు.
- గాలి వాన సమయంలో కరెంటు లైన్ కింద నిలబడటం, కూర్చోవటం చేయరాదు.
- ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టరు) తెగి పడి ఉంటే దానిని విద్యుత్ సరఫరా ఉన్నదిగా పరిగణించి సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని నేరుగా తాకరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి తెలియజేయాలి.
- మోటార్ స్టార్టర్లు, మోటార్లు వర్షం నీటిలో మునగటం, పూర్తిగా తడవటం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కావున రైతులు జాగ్రత్తగా ఉండాలి
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన ఎడల ఆ వ్యక్తి గాని, విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదు. వెంటనే దగ్గరలో విద్యుత్ అధికారి/ సిబ్బందికి తెలియజేయాలి.
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912కు కాల్ చేయాలి.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు సత్కారం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8: తాడేపల్లిగూడెంలో అపుస్మా జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసి ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ధర్మరాజు పాల్గొని అపుస్మా అందించే సేవలను కొనియాడారు. అనంతరం అపుస్మా ప్రతినిధులు సమస్యలపై అందించిన వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, కార్యదర్శి ఏవీవీ సుబ్బరాజు, కోశాధికారి కె.రామకృష్ణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో ఆర్వోబీ పనులు


ఆర్వోబీని పరిశీలిస్తున్న అధికారులు

ఉండి, సెప్టెంబరు 8: ఉండిలో నిలిచి పోయిన ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్టు ఆర్వోబి అధికారులు వెల్లడించారు. 2020లో చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఈ పనులపై ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఇటీవల కేంద్ర, రాష్ట్ర మంత్రులు దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఫైల్ కదలిక ఏర్పడింది. ఉండిలోని రైల్వేగేటు వద్ద నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి పనులు తొలుత వేగంగానే సాగాయి. తదుపరి కరోనా సమయంలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అధికారుల బృందం శనివారం ఉండిలో ఆర్వోబిని పరిశీలించారు. వర్షాలు తగ్గిన తక్షణమే పనులు చేపట్టి పూర్తిచేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

మౌనికకు ఆరోగ్యశ్రీలో వైద్యం



బుట్టాయగూడెం, సెప్టెంబరు 8: కొండరెడ్డి బాలిక గోగుల మౌనికకు ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎం&హెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు తెలిపారు. లంకపాకల గ్రామానికి చెందిన గోగుల మౌనిక లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుచూ గత బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు అనంతరం బాలికల గుండెచుట్టూ కండరాలు పెరగటంతో ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని అందుకు సుమారు 5 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులకు చెప్పడంతో కూలీ చేస్తేగాని పూటగడవని ఆదివాసీ కొండరెడ్ల బిడ్డను బ్రతికించమని ఆరోగ్యశ్రీలో వైద్యం అందించాలని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ద్వారా ప్రభుత్వాన్ని, ఐటీడీఏ అధికారులను వేడుకున్నారు. కథనంపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు మౌనికకు మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎం&హెచ్‌వోను ఆదేశించారు. మౌనిక తల్లిదండ్రులకు ఆరోగ్యశ్రీ ఉన్నా కార్డులో మౌనిక పేరు ఎక్కకపోవడంతో ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం చేయడానికి ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించలేదు. దీనితో జిల్లా అధికారులు ఆరోగ్యశ్రీ జిల్లా అధికారితో మాట్లాడి పాప పేరును కార్డులో చేర్చి యుద్ధ ప్రాతిపదికన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.



ఎయిర్‌పోర్టుకు స్థలం సేకరిస్తే సహకరిస్తా

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, సెప్టెంబరు 8: భీమవరం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హామీ ఇచ్చారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఛాంబర్ తరుపున ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. ఎమ్మెల్యే అంజిబాబు ఎయిర్ పోర్టు విషయాన్ని ప్రస్తావించారని అందుకు దాదాపు 600 ఎకరాలు అవసరం ఉంటుందని సేకరణ చేస్తే తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ పట్టణానికి ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం 600 ఎకరాలు భూమి సేకరించి అందజేయడానికి సిద్ధమని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు భీమవరానికి సరికొత్త వాణిజ్య, పారిశ్రామిక వృద్ధికి దారి తీస్తుందని అన్నారు. అదే విధంగా రింగ్ రోడ్డు నిర్మాణ విషయంపై దృష్టిపెడతామని అన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ అందరం కలసి ఎయిర్ పోర్టు నిర్మాణానికి కృషిచేద్దామని అన్నారు. అనంతరం ఛాంబర్ తరుపున కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లను సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), నార్ని తాతాజీలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామ్మోహనరావు(రాంపండు), సంగడి వీర వెంకట శివ సత్యనారాయణ(బుజ్జి), మానేపల్లి సూర్యనారాయణగుప్త, కనుమూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీపై పసుపు పతాక

- టీడీపీలో చేరేందుకు చైర్మన్ ఘంటా పద్మశ్రీ సుముఖం
- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరాలని తాజాగా నిర్ణయం
- మరికొందరు జడ్పీటీసీల్లోను భారీ కదలిక
- రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమక్షంలో జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు చేరిక



జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అధికారంలో ఉన్నన్నాళ్ళు వైసీపీ నాయకులు తొడలు చరిచారు. ప్రత్యర్థి పార్టీలను అణగతొక్కేందుకు అక్రమ కేసులతో చెలరేగిపోయారు. అంతకంటే మించి తామే సర్వస్వం అన్నట్టు వ్యవహరించారు. ఇక ఏ పార్టీకి మనుగడ లేదంటూ గప్పాలు పలికారు. తీరా గడిచిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాజయం ఎదురైంది. గోదావరి జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో తుడిచి పెట్టుకుపోయారు. ఆఖరుకి పార్టీ ముఖ్యనేతలంతా ఇప్పటికే బైబై చెప్పేశారు. మిగిలిన ఇంకొందరు మరికొద్ది రోజుల్లోనే వైసీపీకి బిగ్ షాక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా జిల్లా పరిషత్ వ్యవహారం గత కొద్ది రోజులుగా అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ దంపతులు వైసీపీపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. నేరుగా జనసేనలో కలిసేందుకు అడుగులు వేశారు. జనసేన ముఖ్య నేతలతో సంప్రదింపులు నెరపారు. ప్రత్యేకించి తాము జనసేన పార్టీలో చేరడానికి సుముఖంగా ఉన్నామని అంగీకరిస్తే పవన్‌కళ్యాణ్ సమక్షంలోనే పార్టీలో చేరతామని పదేపదే లీకేజీలు ఇస్తూ వచ్చారు. సోషల్ మీడియాలో జడ్పీ చైర్మన్ దంపతుల వ్యవహారం చిలువలు పలువలుగా ప్రచారమైంది. ఇంతకుముందే జడ్పీ చైర్మన్‌కి ఇప్పటి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా మారింది. దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి జడ్పీ చైర్మన్ దంపతులు అత్యంత సన్నిహితం. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్‌కు వ్యతిరేకంగా వీరు పదేపదే విమర్శలు చేయడమే కాకుండా ఆయనపై కేసులకు ప్రయత్నించారు. దీనిని అప్పట్లోనే ప్రభాకర్ దీటుగా ఎదుర్కొన్నారు. ఇప్పుడు మారిన రాజకీయ పరిణామాల క్రమంలో తొలుత జనసేనలో చేరతామన్న ఆలోచన విరమించుకున్న జడ్పీ చైర్మన్ దంపతులు టీడీపీలో చేరాలని నిర్ణయించి ఆ మేరకు కొందరు నేతల ద్వారా టీడీపీ పెద్దలకు సమాచారం పంపారు. తాము స్వచ్ఛందంగా పార్టీలో చేరతామని సంకేతాలు ఇచ్చారు. ఈ మధ్యకాలంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులతోపాటు మరికొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, దాదాపు ఏలూరు కార్పొరేషన్ టీడీపీ వశమైంది. ఇప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్ పార్టీలో చేరిన పక్షంలో జడ్పీ తమ ఆధీనంలోకి వస్తుందని టీడీపీ భావించింది. దీనికి అనుగుణంగానే జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతోను పార్టీ సీనియర్లు శనివారం చర్చించారు. జడ్పీ చైర్మన్ పద్మశ్రీ భర్త వైసీపీ నేతను పార్టీలో చేర్చుకోవడానికి అంగీకరిస్తూ ఈ ప్రక్రియను దగ్గరుండి చూడాల్సిందిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును ఆదేశించారు. ఇప్పటికే వైసీపీకి ఘంటా ప్రసాదరావు రాజీనామా చేశారు. ఆయన బాధ్యత వహిస్తున్న వైసీపీ బీసీ విభాగం అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే టీడీపీలో చేరేందుకు నిర్ణయించడంతో ఘంటా ప్రసాదరావును వెంటపెట్టుకుని విశాఖపట్టణంలో ఉన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్దకు గన్ని తీసుకువెళ్ళారు. అక్కడే ప్రసాదరావుకు తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొన్ని విషయాలపూ పూర్తిగా ఆరా తీసినట్టు సమాచారం. ముందస్తుగా జడ్పీ చైర్మన్, ఆమె భర్తను పల్లా శ్రీనివాసరావు వద్దే పార్టీలో చేరాలని టీడీపీ కోరగా జడ్పీ చైర్మన్ హోదాలో తాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుటే టీడీపీలో చేరతానని సంకేతాలు ఇచ్చారు. దీంతో జడ్పీ చైర్మన్‌ను ముఖ్యమంత్రి సమక్షంలోనే టీడీపీలో చేరేందుకు తేదీలను ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే నాలుగేళ్ళు తరువాతేనని అధికారిక నిబంధన ఉంది. జిల్లా పరిషత్‌లో వైసీపీదే ఏకపక్ష బలం 46 అయినప్పటికీ మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జడ్పీ సభ్యులు కూడా ఇప్పటికే అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆచంట జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ, వీరవాసరం జడ్పీటీసీ స్థానాన్ని జనసేన దక్కించుకున్నాయి. ఈ రెండూ మినహా మిగిలిన స్థానాలన్నింటిలోనూ వైసీపీదే ఆధిపత్యం. ముందుగా జడ్పీ చైర్మన్ పార్టీ నుంచి పక్కకు తప్పుకుంటే ఆ బాటలోనే ప్రయాణించేందుకు ఇంకొందరు సంసిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తెలుగుదేశం జడ్పీ చైర్మన్‌ను పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించింది.

అందరినీ ఒప్పించి మెప్పించి..

జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులను పార్టీలో చేర్చుకునే విషయంలో తెలుగుదేశం ఆచితూచి అడుగులు వేసింది. ప్రత్యేకించి ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్పీటీసీలు కొందరు టీడీపీలో చేరేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు సానుకూల సంకేతాలు పంపారు. వైసీపీ ఆధీనంలో జిల్లా పరిషత్ కొనసాగినా విధులు.. నిధుల విషయంలో జడ్పీటీసీలు చాలా కాలం నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరందరినీ ఒక గాటన తెచ్చేందుకు వేచి చూసిన తెలుగుదేశం తాము ఊహించినట్టుగానే జడ్పీ చైర్మన్ ఈ వైపు తొంగి చూడడంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకున్నారు. సమాంతరంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోను, పార్టీ ప్రముఖులు కొందరు ముందస్తుగా చర్చించిన తరువాతే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

కొంప కొల్లేరు

వరద నీటిలో కొల్లేరు వాసుల అవస్థల దృశ్యాలు


కడిమికుంటలో ఇళ్ళల్లోకి చేరిన నీరు


చర్చిలోకి చేరిన వరద


పెనుమాకలంకలో పసి పిల్లలతో మహిళలు


పడవలో సరుకులు తెచ్చుకుంటున్న మహిళలు


పెనుమాకలంక స్కూల్‌లోకి చేరిన చెరువు నీరు


పెనుమాకలంకను చుట్టుముట్టిన కొల్లేరు

ఏలూరు, పశ్చిమ జిల్లాల

కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం


రామ్మోహన్

ఏలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నేత రాజనాల రామ్మోహన్‌ను ఏఐసీసీ నియమించింది. ఉమ్మడి పశ్చిమలో కాంగ్రెస్ వర్గాల్లో సీనియర్ అయిన రామ్మోహన్ ఇంతకు ముందు కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పక్షాన విశేష కృషి చేశారు. షర్మిల కూడా ఆయన పనితీరు పట్ల ఇంతకు ముందే సంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొంటూ ఏఐసీసీ నేతలు సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గేలతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపినట్టు రామ్మోహన్ తెలిపారు.


హరికుమార్ రాజు

గణపవరం: పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా పాతపాటి హరికుమార్‌రాజు నియమితులయ్యారు. పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం హరికుమార్‌రాజు నియామక ఉత్తర్వుల కాపీలను స్థానిక విలేకర్లకు అందజేశారు. 1990లో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా రాజకీయ అరంగేట్రం చేసిన హరికుమార్‌రాజు పార్టీ విధేయునిగా ఉంటూ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ఆయన సేవలందించారు. జిల్లా అధ్యక్షుడి పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేజీ.వేణుగోపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెంకు చెందిన మార్నిడి బాబ్జిని నియమిస్తూ పార్టీ ఆదేశాలు విడుదల చేసింది. బాబ్జి నరసాపురం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తాడేపల్లిగూడెం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

బియ్యపు గింజపై వినాయక ప్రతిమ



నరసాపురం, సెప్టెంబరు 8: రుస్తుంబాదాకు చెందిన చిత్రకారుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత కొప్పినీడి విజయమోహన్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని ఒక బియ్యపు గింజపై సూక్ష్మదర్శిని ఉపయోగించకుండా వినాయక రూపాన్ని చెక్కాడు. కేవలం గంట వ్యవధిలోనే గింజను గణనాథుడిగా మార్చాడు. అతని ప్రతిభను పలువురు అభినందించారు.

టిడ్కో సముదాయాల వద్ద విషసర్పాలు



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8: ఎల్. అగ్రహారం టిడ్కో ఇళ్ల సముదాయాల్లో విషసర్పాలు ఆ ప్రాంత వాసులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల మధ్యలో పేరుకు పోయిన తుప్పల మాటున భారీ విష సర్పాలు వర్షాలకు బయటకు వచ్చి పైపులైన్‌లకు చుట్టుకోవడంతో ప్రజలు హడలిపోతున్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



భీమవరం క్రైం, సెప్టెంబరు 8 : భీమవరం - పెన్నాడ రైల్వే స్టేషన్ల సమీపంలో భారతీయ విద్యాభవన్స్ స్కూల్ వెనకాల రైలు పట్టాలపై ఒక యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక కముజువారిపాలెంకు చెందిన కముజు బాలాజీ (22) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలాజీ శనివారం రాత్రి రైలు కిందపడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

వాగులో పడి అధ్యాపకుడి మృతి

లింగపాలెం, సెప్టెంబరు 8: మండలంలోని తువ్వచిలుక రాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు చాట్రాయి మండలం తుమ్మగూడెం వాగులో పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి సూర్యప్రకాష్ (35) తుమ్మగూడెం గ్రామానికి వెళ్తూ మార్గమధ్యలో వాగు దాటుతుండగా నీటి ప్రవాహానికి మోటారు సైకిల్‌తో పాటు కొట్టుకుని పోయి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు ఏలూరు ఎన్నారై కాలేజీ లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య కుమార్తె ఉన్నారు.

కాల్వలో కాలు జారిపడి ఆక్వా రైతు..

పోడూరు, సెప్టెంబరు 8: ప్రమాదవశాత్తు కాలు జారిపడి పడి ఆక్వారైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వద్దిపర్రు శివారు మొండిగర్వుకు చెందిన గెద్దాడ వెంకట ప్రసాదు(40) శుక్రవారం రాత్రి తండ్రి వీరభద్రరావును చెర్వు వద్ద పెట్టి ఇంటికి బయలుదేరి వెళ్లాడు. మరుసటిరోజు శనివారం ఉదయం తండ్రి వీరభద్రరావు ఇంటికి వస్తూ నక్కల డ్రెయిన్ వద్ద తన కుమారుడు వెంకట ప్రసాదుకు చెందిన బైకు, చెప్పులు ఉండటంతో అనుమానం వచ్చి ఇంటికి ఫోన్‌చేసి కోడలను దివ్యను ఆరా తీశాడు. కుమారుడు రాత్రి ఇంటికి రాలేదని చెప్పడంతో స్థానికులకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది నక్కల కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వెంకట ప్రసాదు మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల చెరువులో పడి ఒకరు..

ఆకివీడు, సెప్టెంబరు 8 : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వ్యక్తి శవమై కనిపించాడు. ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్త చెరువు కొత్తపేటకు చెందిన దాసరి వెంగళరావు (58) ఈ నెల 6న రాత్రి భోజనం చేసి బయటకు తిరిగి వెళ్ళి రాలేదు. 7న గ్రామంలోని చేపల చెరువులో పడి చనిపోయి ఉన్నట్లు కుమారుడు దాసరి కుమార్‌బాబు గుర్తించి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కార్మికుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8 : టైల్స్‌పని చేస్తున్న ఒక కార్మికుడు తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు పత్తేబాద శివాలయం వీధికి చెందిన ముళ్ళగిరి నరేష్ (38) కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని భార్య కొన్నేళ్ళ క్రితం వదిలేసింది. టైల్స్ పని చేస్తూ ఉంటాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. పక్కింటి వారికి ఆ ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లడంతో కిటికిలోనుంచి చూడగా అతని మృతదేహం కనిపించింది. ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మృత దేహం కుళ్ళిపోయి, ఉబ్బిపోయి ఉంది. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో వివాదం

మూడు నెలల తర్వాత హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) కోటయ్య (ఫైల్)

ముదినేపల్లి, సెప్టెంబరు 8 : పాత కక్షల నేపథ్యంలో ఊటుకూరు గ్రామంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిని అతి కిరాతకంగా నరికి చంపాడు. వినాయక చవితినాడు జరిగిన ఈ ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లిలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... ఊటుకూరులో ఈ ఏడాది మేలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటుతోపాటు బాణసంచా పేల్చిన విషయంలో నిర్వాహకులు గూడవల్లి శ్రీను బాబు కుటుంబీకులకు, మరి కొందరికి సమీప బంధువైన పోసిన బాలకోటయ్య కుటుంబీకులకు మధ్య గొడవలు జరిగాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగిన మరుసటి రోజు తిరిగి ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగగా, బాలకోటయ్య కుటుంబీకులు గూడవల్లి శ్రీను బాబు కుటుంబీకులు నలుగురిని కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై అప్పట్లో ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి బాలకోటయ్య, అతని భార్య కుమారులను అరెస్టు చేయగా, 31 రోజుల రిమాండ్ అనంతరం జూన్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య కక్షలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెం నుంచి బైక్‌పై ఊటుకూరు వస్తున్న బాలకోటయ్య (54)ను కొందరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. హతుడి భార్య గాయత్రి, కుమారుడు చైతన్య ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకునే సరికే బాలకోటయ్య మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది.

పాత కక్షలతోనే హత్య..

తమ మేనమామ కుటుంబంతో ఉన్న పాత కక్షల కారణంగానే తన తండ్రి బాలకోటయ్య హత్య జరిగిందని హతుడి కుమారుడు పోసిన చైతన్య ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రిని గూడవల్లి శ్రీను బాబుతోపాటు శ్రీను, శివాజీ, మహంకాళిరావు, పద్మ, జ్యోతి, ప్రశాంత్ కుమార్, ఉదయ సాయి, నాగరాజు, రాజేష్ హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనా స్థలాన్ని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు పికెట్ ఏర్పాటు

ఊటుకూరు గ్రామం భయం గుప్పెట్లో ఉంది. శనివారం గ్రామానికి చెందిన పోసిన బాలకోటయ్య (54) ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురికావటం, ఇందుకు తమ బంధువులే పాత కక్షలతో హత్య చేశారని హతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఇరు వర్గాల మధ్య మరింత కక్షలు పెరిగి పరిస్థితి ఎటు దారి తీస్తుందోనన్న భయం గ్రామస్థుల్లో కలుగుతున్నది. ఊటుకూరు గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. హత్యకు సంబంధించిన వివరాలను ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌లు ఆదివారం సేకరించాయి. పోలీసు జాగిలాలు నేర స్థలం నుంచి ఊటుకూరు గ్రామం వైపు వెళ్లి తిరిగి నేరస్థలానికి వచ్చాయి.

భార్యను గాయపరిచిన భర్తపై కేసు

ఉండి సెప్టెంబరు 8: కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 6వ తేదీన చెరుకువాడలో ఇంటి వద్ద వున్న తనని తన మేనత్తని భర్త మంగన్న అతని స్నేహితుడి సత్యమూర్తితో కలిసి గాయపరిచినట్లు తెలిపారు. భార్య అపర్ణ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

కోడి పందేల్లో 9 మంది అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలో కోడి పందేలు శిబిరంపై రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ కోడి పందేలు ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కోడిపుంజులు, 8 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కృష్ణాయపాలెంలో అశ్లీల నృత్యాలు చేయడంపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అశ్లీల నృత్యాలు చేసిన మహిళా వేషధారులను అదుపులోకి తీసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఉండి: అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎండి.నజీరుల్లా తెలిపారు. పెదపుల్లేరు గ్రామంలో గత నెల 15వ తేదిన లక్ష్మీవారాల పండుగను పురస్కరించుకుని రాత్రి 11గంటల సమయంలో గ్రామానికి శివారున ఫ్లడ్‌లైట్లు వెలుతురులో ఇరువురు ట్రాన్స్‌జెండర్లును తీసుకు వచ్చి అశ్లీల నృత్యాలు చేయించారు. ఈ ఘటనలో 8 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




ఆకివీడు ఉప్పుటేరు వంతెన వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రఘురామ, కామినేని శ్రీనివాస్.. సిద్ధాపురం వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఆక్రమణలు తొలగించండి : ఎమ్మెల్యే రఘురామ

కాళ్ళ/ఆకివీడు/ఆకివీడు రూరల్, సెప్టెంబరు 8:పంట, మురుగు కాల్వలను ఆక్రమించుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అధికారులకు సూచించారు. కాళ్ళ మండలం పెదఅమిరంలో ఆక్రమణలకు గురైన కాల్వలను, ఆకివీడు మండలం సిద్ధాపురం వైపు వెళ్లే వంతెన వద్ద చినకాపవరం మురుగుకాల్వలను ఆదివారం ఆయన పరిశీలించి, అనంతరం కాళ్లలో ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. పెదఅమిరం, దొడ్డనపూడి సర్పంచ్‌లు డొక్కు సోమేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, నాయకులు కటారి నరసింహరాజు, ముదుండి రాజేష్, కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆకివీడులో నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్‌ను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే నీటి ప్రవాహనికి ఆటంకంగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆకివీడులో టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, బత్తుల రవి తదితరులు ఉన్నారు.

కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు

ఆకివీడురూరల్, సెప్టెంబరు 8 :ప్రజలు వరద ముంపు బారిన పడకుండా యుద్ధ ప్రాతిపదికన ఉప్పుటేరులో రోడ్డు-రైల్వే వంతెన వద్ద ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు, కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉప్పుటేరు రోడ్డు వంతెన వద్ద వారు ప్రవాహాన్ని పరిశీలించారు. లాంగ్‌స్టిక్ కలిగిన ఎక్స్‌కవేటర్‌తో తూడు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగిస్తున్నట్లు తెలిపారు.

సిద్ధాపురం డ్రెయిన్ షట్టర్‌కు నిధులు మంజూరు..

సిద్ధాపురం డ్రెయిన్ వల్ల సుమారు 500 ఎకరాల రైతులు ఇబ్బందులు పడకుండా షట్టర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నిధులు మంజూరు చేశారు. వరద నీటిని బయటకు తోడుకునేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌లు, వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని ఎలక్ట్రికల్ ఎస్ఈని ఫోన్‌లో కోరి అనుమతి ఇప్పించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సిద్ధాపురం, చినిమిల్లిపాడు, కళింగపాలెం గ్రామాలలో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్, నౌకట్ల రామారావు, గొంట్లాగణపతి, బొల్లా వెంకట్రావు, భూపతిరాజు తిమ్మరాజు, కన్నయ్యరాజు, పూజారి వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతిలో డిగ్రీ దేశాభివృద్ధికి పునాది కావాలి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8: విద్యార్థుల చేతిలోని డిగ్రీ పట్టా దేశాభివృద్ధికి పునాదికావాలని తిరుచ రాపల్లి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎన్‌వీఎస్ నరసింహ శర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ మామిళ్లపల్లి రవిశంకర్, ట్రిపుల్-ఎఫ్ టెక్నికల్ డైరెక్టర్ ఓపీ గోయెంకా, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు కళాశాల టాపర్‌లకు బంగారు పతకాలు, సర్టిఫికెట్‌లు అందించారు.

గతించిన వారి పేరుతో సేవలు అభినందనీయం

భీమవరంటౌన్, సెప్టెంబరు 8 : గతించిన వారి పేరిట కుటుంబ సభ్యులు సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు తల్లి సత్యవతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే అంజిబాబుతో కలసి అందజేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు మెంటే పార్థసారథి, మల్లినీడి తిరుమలరావు, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కె.వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

నరసాపురం రూరల్, సెప్టెంబరు 8:ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మాలల న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. ఆదివారం సరిపల్లి గ్రామంలోని అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో సమితి నాయకుడు సోడదాశి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగపరంగా జనాభా లెక్కలు చేపట్టకుండా రాష్ట్రంలో వర్గీకరణ చేసేందుకు వీలు ఉండదన్నారు. గతంలోనే సుప్రీం కోర్టు వర్గీకరణ చెల్లదని ఇచ్చిన తీర్పును ఆయన గుర్తు చేశారు. దీనిపై బుధవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలని సమావేశం నిర్ణయించింది. సర్పంచ్ ఈదా సురేష్, ఎంపీటీసీ చిన్నం వెంకట్, గమిడి రత్నరాజు, వర్ధనపు ఏసు, జపాన్, దుండి శ్రీనివాస్, పిట్టా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలి

భీమవరం రూరల్, సెప్టెంబరు 8 : వలస కార్మికులకు రక్షణకు చర్యలు చేపట్టి జీవనోపాధిని కల్పించాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ తోకతిప్ప గ్రామంలో ఆదివారం సీపీఎం శాఖ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో అనేక మంది పనులు లేక జీవనోపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలు వలస వెళ్తున్నారని, పని ప్రాంతాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఎంతమంది వలస వెళ్తున్నారు అనేది నమోదు చేయాలని కోరారు. వారి రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, బొడ్డు ఏసు తదితరులు పాల్గొన్నారు.





మొగల్తూరు ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు.. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలో నీట మునిగిన రోడ్డు.. ఉండిలో సీసీ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వీడని వర్షం

- మునిగిన పల్లపు ప్రాంతాలు
- సముద్ర తీరంలో ఈదురుగాలులు
- తెరపివ్వని వర్షం.. తప్పని ఇబ్బందులు
- రహదారులు ధ్వంసం..

నరసాపురం/మొగల్తూరు, సెప్టెంబరు 8: అల్పపీడన ప్రభావంతో తీరంలో ఆదివారం ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. ఈదురుగాలులు ఉధృతి ఎక్కువగా ఉండడంతో వేటకు వెళ్లిన బోట్లన్నీ తిరుగుముఖం పట్టాయి. తుఫాన్ తగ్గే వరకు వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు వర్షాలకు రోడ్లన్నీ నీట మునిగాయి. గ్రామాల్లో చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే వేసిన నారుమడులు నీటిలో తేలిపోయాయి. మొగల్తూరు మండలం మొగల్తూరు ఉన్నత పాఠశాలలో పంచాయతీ సిబ్బంది ఇంజన్లు వేసి నీరు తోడుతున్నా ఇంకా నీరు తగ్గకపోవడంతో పాఠశాల ప్రాంగణం ఇప్పటికే చెరువును తలపిస్తోంది. .

- పెనుగొండ/పెనుమంట్ర :పెనుగొండ మండలంలో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. రహదారులు చెరువుల్లా మారడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పెనుమంట్ర మండలం మార్టేరు, నెగ్గిపూడి, పాలమూరు పెనుమంట్ర, ఆలమూరు, మాముడూరు పల్లపు ప్రాంతాలు నీటముగాయి
- పాలకొల్లుఅర్బన్/పాలకొల్లు రూరల్/ :పాలకొల్లు పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, వెలమగూడెం, కొత్తపేట కొత్తకాలనీ, క్రిస్టియన్‌పేట, రాజీవ్‌నగర్ కాలనీ, చిత్రాయి చెరువుగట్టు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు
- కాళ్ళ/పాలకోడేరు/ఉండి: ఎడతెరపి లేని భారీ వర్షాలకు అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. చేలన్నీ నీట మునిగిపోయాయి. కాళ్ళలంక, ఏలూరుపాడు, కాళ్ళకూరు, కోపల్లె తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ప్రధాన రహదారులన్నీ ధ్వంసమై పెద్దపెద్ద గోతులుపడడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకోడేరు మండలంలో పల్లపు ప్రాంతాలన్నీ వర్షపునీటితో జలమ యమయ్యాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఉండి మండలంలో సీసీ రహదారులు, డ్రెయినేజీలు పొంగి రహదారులపైకి చేరాయి. పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.






భీమవరం మావుళ్ళమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న కొయ్యే మోషేన్‌రాజు.. పాలకొల్లు గోల్డ్ మార్కెట్, అలంపురం టీబీఆర్ స్కూల్ వద్ద భోగేశ్వరరావు దంపతుల పూజలు.. సిద్ధాంతంలో గణేష్ విగ్రహ గ్రామోత్సవం

జై గణేశా..

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పూజలు
- వాడవాడలా పందిళ్లు.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భీమవరంటౌన్/భీమవరం రూరల్, సెప్టెంబరు 8 : భీమవరం పట్టణంలో వినాయక చవితిని భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. భీమవరం మండలం గొల్లవాని తిప్ప గ్రామంలోని వరసిద్ధి వినాయక స్వామి చవితి మహోత్సవంలో కొనిశెట్టి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు. రాయలంలోని విజయ సాయిబాబా ఆలయంలో పత్తి హరివర్ధన్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. గునుపూడిలోని విద్యాగణపతి ఆలయంలో స్వామిని తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. మెంటేవారితోటలోని విజయగణపతికి బండారు గంగాధర స్వామి, లావణ్యదంపతులు పలురకాల స్వీట్లను నైవేద్యంగా సమర్పించారు. గునుపూడిలోని పంచారామ క్షేత్రమై, సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో వినాయక చవితి సందర్భంగా గునుపూడికి చెందిన మల్లినీడి సత్యనారాయణమూర్తి కుమార్డు జనసేన పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ ఛైర్మన్, మల్లినీడి తిరుమలరావుచే ఆలయాన్ని పుష్పాలకరణ చేశారు. శ్రీమావుళ్ళమ్మ దేవస్థానం ఉపాలయం అశ్వత్థగణపతి ఆలయంలో రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే అంజిబాబు దర్శించుకుని పూజలు చేశారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దంపతులు పూజలు చేశారు. భీమవరం మండలం తుందుర్రు, పలు గ్రామాలో గణనాథుడి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనాలు చేశారు.

- కాళ్ళ/ఆకివీడు/పాలకోడేరు/ఉండి : కాళ్ల మండలంలోని జువ్వలపాలెం, ఏలూరుపాడు, కాళ్ళకూరు తదితర గ్రామాల్లో, ఆకివీడులోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు మాట్లాడారు. పాలకోడేరు మండలంలోని 14 గ్రామాల్లో సుమారు 125 విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. ఉండి మండలంలో శాలిపేట, కాపులపేట, యండగండి, ఉణుదుర్రు, పాందువ్వ, ఉప్పులూరు, కోలమూరు తదితర గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరిగాయి.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని అంకానివారిపాలెం వద్ద 17 అడుగుల భారీ విగ్రహాన్ని కాళభైరవ రూపంలో ఏర్పాటు చేశారు. మండలంలోని కొప్పర్రు, లిఖితపూడి, చిట్టవరం, లక్ష్మణేశ్వరం, ఎల్‌బీచర్ల తదితర గ్రామాలు, మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, కడలివారిపాలెం, సత్రవు పాలెం, పడమటిపాలెం తదితర ప్రాంతాల్లో వినాయకుడిని నిలబెట్టి నవ రాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల ఆదివారం భారీ ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు.
- పాలకొల్లు అర్బన్/యలమంచిలి : పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డులు, ఆలయాల్లోనూ, గృహాల్లోనూ గణనాథుడిని ప్రత్యేకంగా పూజలు చేశారు. శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వినాయకునికి పూజలు చేశారు. అభిషేక పండితుడు భమిడిపాటి వెంకన్న చవితి కథను వినిపించి, కథాక్షింతలు, ప్రసాదం పంపిణీ చేశారు. యలమంచిలి మండలంలోని యలమంచిలి, మేడపాడు, అడవిపాలెం, అబ్బిరాజుపాలెం తదితర గ్రామాల్లో వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు.
- పెనుగొండ/ఆచంట/పోడూరు/పెనుమంట్ర : పెనుగొండ మండలం పెనుగొండలో వాసవీ శాంతి ధాంలోనూ శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో, బస్టాండ్ వద్ద సంపత్ వినాయకస్వామి ఆలయం వద్ద చవితి వేడుకలు నిర్వహించారు. సిద్ధాంతం చౌదరీస్ రామాలయం వద్ద, చింతలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో చవితి ఉత్సవాలు నిర్వహించారు. సిద్ధాంతం తానేష్‌పాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో చవితి ఉత్సవాలు 50 సంవత్సరాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. వడలి గ్రామంలో అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోని గణపతిని ఎలుక వాహనంపై కూర్చుండబెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. ఆచంట మండలంలో పలు మండలపాల వద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పోడూరు మండలం పోడూరు సరళదొడ్డిలో భారీ మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు.పెనుమంట్ర మండలం పెనుమంట్రలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి విగ్రహానికి ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాధాదేవి దంపతులు, ముఖం శ్రీనివాస్ నాగమణి దంపతులు. స్వామి వారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- గణపవరం : గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ మండలి సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లపురాజుపేటలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, మాజీ సర్పంచ్ కల్యాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిప్పరలో గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు పూజలు చేశారు.
- పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్ : పాలకొల్లు పట్టణంలో ఉత్సవ కమిటీ సభ్యులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ధర్మపరిరక్షణ సమితి వినూత్నంగా చేపట్టిన కార్యక్రమంలో ఆయా మండపాల వద్దకు వెళ్ళి కమిటీ సభ్యులను సత్కరించి, స్వామివారికి ప్రసాదంగా నివేదించడానికి కిలో లడ్డూ చొప్పన అందజేశారు. సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, కార్యదర్శి శీరం ఆనంద కృష్ణ, జక్కంపూడి కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణంలోని పలు ప్రధాన సెంటర్లలో భారీ మట్టి వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి గణేష్ నవరాత్రి ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.
- తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు : సెప్టెంబరు 8: తాడేపల్లిగూడెం పట్టణంలో పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేశారు. పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి దర్శించుకుని పూజలు చేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద సంస్థ అధినేత తనుబుద్ధి బోగేశ్వరరావు ఆధ్వర్యంలో గణనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పూజలు చేశారు.
- తణుకు : గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సత్తిరాజు వారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకోగా కమిటీ నిర్వాహకులు ఆరిమిల్లిని సత్కరించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ

తాడేపల్లిగూడెం రూరల్ : వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా జరపాలని డీఎస్పీ మూర్తి సూచించారు. తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణం, మండలం, పెంటపాడు మండలాల్లో ఉత్సవాల నిర్వహణకు 171 మంది దరఖాస్తు చేసుకున్నారని అందరికీ షరతులతో కూడిన అనుమతులు ఇచ్చామన్నారు. సీఐ రమేష్, ఎస్ఐ ప్రసాద్. సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి తరలి రావాలి

ఆకివీడు : చినకాపవరం మురుగు కాల్వ ఉధృతి పెరుగుతుందని సమీపవాసులు పునరావాస కేంద్రానికి తరలి రావాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు సూచించారు. ఆదివారం స్థానిక సమతా నగర్‌లోని వీరమల్లుకాలనీ, పుచ్చలదిబ్బ ప్రాంతాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పునరావాసులకు సుమారు రూ.30వేలతో జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు నేతృత్వంలో జనసైనికులు భోజనాలు ఏర్పాటు చేశారు. దారపురెడ్డి కన్నబాబు, నంద్యాల శివ ఉన్నారు. మరోవైపు వీరమల్లు కాలనీలోని ఇళ్లల్లో ఎవరూ ఉండవద్దని వర్షపు నీటిలో తిరుగుతూ పోలీసులు మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు.



వీరమల్లు కాలనీలో మైక్‌తో పోలీసుల ప్రచారం

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి, సెప్టెంబరు 8: వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. రాజమహేంద్రవరం పల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏనుగువానిలంక గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నరసాపురం టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఉండాలన్నారు. రాజమండ్రి పల్స్ హాస్పిటల్ డాక్టర్లు కె.వంశీకృష్ణ, లక్ష్మణ్ రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామసర్పంచ్ ఈద ప్రమీల, వినుకొండ రమేష్, కొడవటి వరబాబు, తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుల శ్రమదానం



యలమంచిలి, సెప్టెంబరు 8: యలమంచిలి- చించినాడ ప్రధాన రహదారిపై పెద్దఎత్తున పడిన గోతులను పూడ్చేందుకు యలమంచిలికి చెందిన పలువురు జన సైనికులు ఆదివారం నడుం బిగించారు. కాంక్రీటు ముక్కలను ఆటోలపై తరలించి పీచుఫ్యాక్టరీకి సమీపంలో రహదారిపై ఉన్న గుంతలను పూడ్చారు. శ్రమదానం చేసిన జనసైనికులను గ్రామస్థులు అభినందించారు. కొడవటి మాధవ్, కాసా మణికంఠ, కాసా నాగరాజు, కొడవటి పవన్, ఆకుల బంగారి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం, వైద్యం, తాగునీరుపై దృష్టిసారించండి

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 8: కొల్లేరు ప్రాంతంలో పారిశుధ్యం, వైద్యం, తాగునీరుపై దృష్టిసారించాలని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాలకృష్ణ అన్నారు. చినిమిల్లిపాడు గ్రామంలో ఆయన పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. వరద ముంపు పెరుగుతున్న నేపథ్యంలో పాము కాటుకు మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యశాఖ సిబ్బందిని ఆదేశించినట్టు తెలిపారు. ఇళ్లు మునిగితే చర్చి, కమ్యూనిటీ హాలులో ఉంచేందుకు సిద్ధం చేశామన్నారు. పశువులకు గ్రాసం కోసం పశుసంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడామన్నారు.

డాక్టర్ గరికపాటి రాజారావుకు ఘన నివాళి

భీమవరం అర్బన్, సెప్టెంబరు 8 : ప్రజల్లో చైతన్యం రావాలంటే కళల ద్వారా సాధ్యం అని నమ్మిన వ్యక్తి ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు 61వ వర్ధంతిని ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేల్పుల నాగేశ్వరరావు, చాన్ బాషా, జవ్వాది దాశరధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





కలెక్టర్‌కు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న డాక్టర్ బి.గోపాలరాజు.. ఎమ్మెల్యేకు రూ.2.50 లక్షల చెక్కు అందిస్తున్న జనసేన నేత వేగేశ్న శివరామరాజు.. రూ.50లక్షల చెక్కు అందిస్తున్న ఏపీ రాష్ట్ర నీటి సరఫరా విభాగం కాంట్రాక్టర్‌ల సంఘ సభ్యులు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

భీమవరంటౌన్, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి వరద సాయం కొనసాగుతూనే ఉంది. భీమవరం హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ బి.గోపాలరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కృష్ణంరాజు శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణిని కలిసి ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. భీమవరం మోహన్ సర్వీస్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రొప్రైటర్ కె.బాలకృష్ణంరాజు కలెక్టర్ నాగరాణిని కలిసి రూ.2లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ పేరున అందజేశారు.

- సీఎం సహాయ నిధికి రూ.2లక్షల 50 వేలు జనసేన నాయకులు వేగేశ్న శివరామరాజు, చింతలపాటి బంగార్రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు అందించారు అల్లూరి సత్యనారాయణ రాజు (ఉనికిలి), నడింపల్లి లక్ష్మీపతిరాజు, ఎస్ఎస్‌రావు, కందుల అరవింద్ పాల్గొన్నారు
- మొగల్తూరు, : సీఎం సహాయ నిధికి స్టేట్ వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్‌ల సంఘం రూ.50లక్షలు విరాళం అందించింది. ఆదివారం సంఘ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ మొత్తాన్ని అందించినట్టు సంఘ సభ్యుడు స్థానిక కాంట్రాక్టర్ లోకం నాని తెలిపారు.
- ఆకివీడు : విజయవాడ వరద బాధితుల కోసం ఐదు వేల మందికి సాయిదుర్గానగర్‌లో ఉన్న సాయి మందిరం సేవకులు ఏర్పాటుచేసిన ఆహార పొట్లాల వాహనాన్ని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు జెండా ఊపి ప్రారంభించారు. సాయి సేవకులు, టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.
- తణుకు : తణుకు టీడీపీ క్యాంపు కార్యాలయంలో పలువురు సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు ఆదివారం అందజేశారు. ముళ్ళపూడి మృత్యుంజయ ప్రసాదు రూ. 2 లక్షలు, డాక్టర్ కె.సత్యనారాయ ణరాజు రూ. 50 వేలు, దాసం బాబ్జి రూ.పది వేలు, అత్తిలి లయన్స్ క్లబ్ రూ.25 వేలు, వై.నారాయణరావు రూ. లక్ష చెక్కులు అందజేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్:తాడేపల్లిగూడెం జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు పలువురు దాతలు సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు మారం వెంకటేశ్వరరావు తనయుడు గిరీష్ గుప్తా రూ. లక్ష, లారీ ఓనర్స్ అసోసియేషన్ నుంచి గురుజు సూరిబాబు రూ. లక్ష, ఆరుగొలను నూకల బుల్లియ్య కుమార్తె డాక్టర్ నూకల దుర్గ రూ.50వేలు, కేఎస్ఎన్ కాలనీ వడ్డెర సంఘం నుంచి రూ.10 వేలు అందజేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ :వరద బాధితుల సహాయార్థం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు పలువురు దాతలు విరాళాలను అందజేశారు. కాళ్ళ త్రిమూర్తులు రూ.20 వేలు, యెలిశెట్టి సోమరాజు రూ. 20 వేలు, దేవాభక్తుని సురేష్‌కుమార్ రూ. 11,116, దొడ్ల బాలాజీ రూ. 10 వేలు, రామచంద్రపురం టీడీపీ నాయకుడు రూ. 10 వేలు, శనగన శ్రీనివాస్ గౌడ్ రూ. 10 వేలు, మిత్రబృందం రూ. 10 వేలు, మాదాసు సతీష్ రూ. 5 వేలు, అడ్డు రంజిత్ రూ. 5 వేలు, మాదాసు అశోక్‌కుమార్ రూ. 5 వేలు అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కూచిపూడి సుబ్రహ్మణ్యం తన కుమారులు ప్రణవ్ సాయి, ప్రణయ్ సాయిల చేతులమీదుగా టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లకు రూ.25వేలు ఆదివారం విరాళం అందించారు. మండలంలోని నందమూరుకు చెందిన శనగన శ్రీనివాస్ గౌడ్ మిత్ర బృందంతో కలిసి రూ.20 వేలు ఆర్థిక సాయం వలవల బాబ్జికి అందించారు.



వలవల బాబ్జికి సాయం అందిస్తున్న ప్రణవ్ సాయి, ప్రణయ్ సాయి



ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళాలు అందిస్తున్న దాతలు



తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు చెక్కులు అందిస్తున్న దాతలు